కాంగ్రెస్‌కు ప్రజల నిరసన సెగ : తలసాని


తలసాని శ్రీనివాస్‌యాదవ్‌తో కె.శేఖర్‌రెడ్డి

గోల్కొండ: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సంవత్సరంలోపే ప్రజల నుంచి నిరసనను ఎదుర్కొంటుందని రాష్ట్ర మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం కార్వాన్ నియోజకవర్గం బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కె.శేఖర్‌రెడ్డి ఆయనను కలిశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థికంగా పూర్తిగా దివాలా తీయించి 40 ఏళ్లు వెనక్కి తీసుకువెళ్లిందని అన్నారు. రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగిన బీఆర్ఎస్ భారీ మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమన్నారు.

దివ్యాంగుల పరికరాల కోసం 30న శిబిరం

గోల్కొండ: దివ్యాంగులకు సహాయ పరికరాలు ఉచితంగా అందించేందుకు ఈ నెల 30వ తేదీన అసెస్‌మెంట్ క్యాంపు నిర్వహిస్తున్నామని గుడిమల్కాపూర్ మాజీ కార్పొరేటర్ బంగారి ప్రకాష్ అన్నారు. గుడిమల్కాపూర్ ఎస్‌బీఐ కమ్యూనిటీ హాల్‌లో ఈ శిబిరం నిర్వహిస్తున్నామని ఆయన అన్నారు. ఇప్పటి వరకు సహాయ పరికరాలు లేని దివ్యాంగులు ఈ క్యాంపునకు రావాలని, వైద్యులు అర్హులైన దివ్యాంగులను గుర్తించేందుకు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఇతర వివరాలకు 9390386245లో సంప్రదించాలని కోరారు.

వన్‌డే టోర్నమెంట్‌లో సత్తాచాటిన మల్లిక్


మల్లిక్ అబ్రార్

గోల్కొండ: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న సీ డివిజన్ వన్‌డే టోర్నమెంట్‌లో గోల్కొండకు చెందిన ఆల్ రౌండర్ ఎంఏ మల్లిక్ అబ్రార్ సత్తా చాటాడు. మొదటిసారిగా సీ డివిజన్‌లో పోటీపడుతున్న మల్లిక్ అబ్రార్ బుధవారం రాయల్‌తో జరిగిన వన్‌డే మ్యాచ్‌లో ఏకంగా ఐదు వికెట్లు తీసి జట్టు విజయానికి బాటలు వేశాడు. ఈ యువ పేసర్ త్వరలోనే హైదరాబాద్ అగ్ర బౌలర్‌గా ఎదగడం ఖాయమని ప్రముఖ కోచ్ సఫ్దర్‌పాషా అన్నారు.

ఆలోచింపజేసిన స్వేచ్ఛ నాటకం


టికెట్లను అమ్ముతున్న కేవీ.రమణాచారి

గన్‌ఫౌండ్రీ: ప్రముఖ నాటక రంగ సంస్థ రసరంజని ఆధ్వర్యంలో బుధవారం రవీంద్రభారతిలో ప్రదర్శించిన స్వేచ్ఛ నాటకం ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకుంది. ఆకాశంలో ఎగురుతున్న గాలిపటం ఆధారంగా రూపొందించిన ఈ నాటకం చూపరులను ఆలోచింప చేసింది. విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రదర్శించగా ప్రభుత్వ పూర్వ సలహాదారులు కేవీ.రమణాచారి స్వయంగా టికెట్లను అమ్మడం విశేషం. ఈ కార్యక్రమంలో సంగీత నాటక అకాడమీ మాజీ ఛైర్మన్ బి.శివకుమార్, రసరంజని సభ్యులు పాల్గొన్నారు.

పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పలువురు వక్తలు


గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ కవుల సంఘం, కళాసూర్య కల్చరల్ ఆర్గనైజేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ కవి జన్వాడ రామస్వామి రచించిన పలు పుస్తకాల ఆవిష్కరణ సభ బుధవారం రవీంద్రభారతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ వివిధ అంశాలపై పుస్తకాలు రాయడమే కాక ఫౌండేషన్‌ను స్థాపించి సేవా కార్యక్రమాలు నిర్వహించ తలపెట్టడం ఎంతో అభినందనీయమన్నారు. అంతకు ముందు గాయని గాయకుల గీతాలాపన ఆహుతులను ఆకట్టుకోగా పలువురు కవులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి కవి సుదామ, విమర్శకులు విహారి, తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షులు నాళేశ్వరం శంకరం, కళాసూర్య అధ్యక్షులు ఎ.ప్రభాకరచారి తదితరులు పాల్గొన్నారు.

కరాటే పోటీలకు ఢిల్లీకి బయల్దేరిన క్రీడాకారులు



జియాగూడ: న్యూ ఢిల్లీలోని గౌతమ్ బుద్ధా యూనివర్సిటీలో ఏఐకేఎఫ్ నేషనల్ కరాటే దో చాపియన్‌షిప్ పోటీలు ఈనెల 28 నుంచి 30 వరకు జరగనున్నాయి. ఈ పోటీలకు జియాగూడ భారత అభ్యుదయ ఉన్నత పాఠశాల విద్యార్థులు బుధవారం బయల్దేరారు. కరాటే డోచా పియన్‌షిప్ తెలంగాణ స్పోర్ట్స్ ప్రధాన కార్యదర్శి ఎంకే శ్రీబాలాజీ నేతృత్వంలో జరిగే ఫైనల్‌లో క్రీడాకారులు పోటీ పడతారని తెలిపారు. ఈ పోటీలు ఏఐకేఎఫ్ తెలంగాణ టీమ్, కరాటే దో అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ స్పోర్ట్స్ ఆధ్వర్యంలో జరుగుతాయని పేర్కొన్నారు.

రైతు బజార్ గోడలపై ఆకట్టుకుంటున్న చిత్రాలు


నాటు వేస్తున్న దృశ్యాలు


పండించిన పంటలను అమ్ముతున్న రైతులు

గోల్కొండ: మెహిదీపట్నంలోని రైతుబజార్ గోడలపై రైతుల దయనందిన జీవితానికి సంబంధించిన చిత్రాలు చూపరులను కట్టిపడేస్తున్నాయి. ప్రహరీ గోడపై వేసిన పంట పొలాలు, రైతు పండించే పండ్లు, కూరగాయలను అమ్మే చిత్రాలు జీవం ఉట్టిపడేలా ఉన్నాయి. కొన్ని రోజుల క్రితం రైతుబజార్ ఎస్టేట్ అధికారులు రోడ్డుకు ఆనుకొని ఉన్న రైతుబజార్ ప్రహరీ గోడపై రైతుల జీవన శైలి చిత్రాలను వేయించారు. దీంతో రైతులు నాగలి పట్టడం, నాటు వేయడం, కూరగాయల అమ్మకం తదితర చిత్రాలు నగరవాసులను ఆకట్టుకుంటున్నాయి. అదే విధంగా రైతుల జీవితాలు ఎంత కష్టమైనవో ఈ చిత్రాలు చూస్తే ఇట్టే అర్థం అవుతుంది.

ఫుట్‌పాత్‌లు ఎక్కడ...?

పాతబస్తీలో నడకదారులు గాయబ్!

- అన్ని ఏరియాల్లో ఫుట్‌పాత్‌ల కబ్జా
- ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు... నడిరోడ్డులో నడక
- ముందుకు సాగని వాహనాలు... తప్పని ట్రాఫిక్ తిప్పలు

చార్మినార్: ఫుట్‌పాత్‌లపై ఎలాంటి వ్యాపారాలు నిర్వహించొద్దు.. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించే విధంగా ఫుట్‌పాత్‌లను కబ్జా చేస్తే.. కఠిన చర్యలు తీసుకుంటాం.. కాలిబాట కోసం ఏర్పాటు చేసిన ఫుట్‌పాత్‌ల కబ్జాలను సహించేది లేదు. ఒకవేళ ఏవరైనా ఫుట్‌పాత్‌లను కబ్జా చేస్తే.. సంబంధిత పోలీసులు వెంటనే తొలగించాలని... నగర పోలీసు కమిషనర్ సీవీ ఆనంద్ ఈనెల 26న టోలీచౌకీలో నిర్వహించిన రోప్ స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం సందర్భంగా తెలిపారు. అంతేకాకుండా దాదాపు 2 కిలో మీటర్ల దూరం వరకు ఫుట్‌పాత్ కబ్జాలతో పాటు ట్రాఫిక్‌కు ఆటంకాలు కలిగించే వాటన్నింటిని తొలగింపజేసి ఫ్రీ ఫ్లో ట్రాఫిక్‌కు తగిన చర్యలు తీసుకున్నారు. ఇలాగే పాతబస్తీలో కూడా రోప్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని ఇక్కడి వాహనదారులు కోరుతున్నారు.


ఫుట్‌పాత్‌లు కనిపించకపోవడంతో నడిరోడ్డుపై కాలినడకన పాదచారులు

నడిరోడ్డు సైతం కబ్జా...

పర్యాటక ప్రాంతమైన చార్మినార్ ప్రధాన రోడ్డులో ఎక్కడా ఫుట్‌పాత్‌లు కనిపించవు. ఒక వేళ ఉన్నా వాటిని పూర్తిగా చిరువ్యాపారులు కబ్జా చేసి వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. అంతేకాకుండా నడిరోడ్లు సైతం చిరు వ్యాపారస్తులు ఆక్రమించుకొని వ్యాపారాలు కొనసాగిస్తున్నారు. వీరికి ఒక ప్లేస్‌ను కేటాయించి క్రమబద్ధీకరించాల్సిన అవసరం ఉంది. వాహనాల పార్కింగ్ కూడా ఫుట్‌పాత్‌లపైనే చేస్తున్నారు. పర్యాటకపరం, వ్యాపారపరంగా, నివాసపరంగా పాత నగరానికి జనం తాకిడి ఎక్కువగా ఉంటుంది.

ఫుట్‌పాత్‌లను కాపాడాలి...

చార్మినార్ ఇన్నర్ రింగ్ రోడ్డు, అవుటర్ రింగ్ రోడ్లతో పాటు పరిసర ప్రాంతాల రోడ్లలో ఫుట్‌పాత్‌లు పూర్తిగా కనుమరుగయ్యాయి. ఇక్కడ ప్రతి రోజు వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. రోడ్లకు ఇరువైపుల కొనసాగుతున్న ఫుట్‌పాత్ వ్యాపారాలు, ఆక్రమణలను నియంత్రించాలని స్థానికులు కోరుతున్నారు. రోడ్లను ఆక్రమించి అమ్మకాలు జరుపుతున్న వారిని పోలీసులు కట్టడి చేయాల్సిన అవసరం ఉందంటున్నారు. చార్మినార్ ఇన్నర్, అవుటర్ రింగ్ రోడ్లలో అవసరమైన చోట రోడ్ల విస్తరణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ఇప్పటికే విస్తరించిన రోడ్ల కూడళ్లలోని ఫుట్‌పాత్‌లను పరిరక్షించాల్సిన అవసరం ఉంది.

ఈ ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌లు అస్సలు కనిపించవు..

నయాపూల్ నుంచి గుల్జార్‌హౌజ్ వరకు, దారుషిఫా చౌరస్తా నుంచి మీరాలంమండి, ఎతేబార్ చౌక్, కోట్ల అలీజా ద్వారా బీబీబజార్ చౌరస్తా వరకు, మదీనా నుంచి పురానాపూల్ చౌరస్తా, కిషన్‌బాగ్, లాల్‌దర్వాజ మోడ్ నుంచి ఛత్రినాక, ఫూల్‌బాగ్ తదితర రోడ్లలో ఎక్కడా ఫుట్‌పాత్‌లు కనిపించవు. దీంతో ఎక్కడ చూసినా ట్రాఫిక్ జాం కనిపిస్తుంది. ముఖ్యంగా ఉదయం,సాయంత్రం వేళల్లో ఇక్కడ వాహనాలతో అడుగుపెట్టిన ఎవరికైనా నరకం కనిపిస్తుంది.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: ధూల్‌పేట్ అండర్ గ్రౌండ్, జాలి హనుమాన్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని మినీ స్టేడియం, బలరామ్ గల్లీ, ధూల్‌పేట్, జాలీ హనుమాన్, బడీ గల్లీ, మహంకాళి దేవాలయం, జుంగురు బస్తీ, సీతల మాత దేవాలయం, హెచ్‌పీ పెట్రోల్ పంప్ తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు.

- ధూల్‌పేట్ ఓవర్ హెడ్, ఆర్‌కేపేట్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని మంగళ్‌హాట్, అమర్‌నగర్ కాలనీ, అజారి హోటల్, బిలాల్ మజీద్, గంగా బౌలి, బంగ్లాదేశ్ తదితర ప్రాంతాలలో మధ్యాహ్నం 3గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

స్విమ్మింగ్ పోటీల్లో వర్షిత్ సత్తా


వర్షిత్‌ను అభినందిస్తున్న కోచ్ సిద్ధికి

గన్‌ఫౌండ్రీ: గుజరాత్‌లో జరుగుతున్న 68వ ఎస్‌జీఎఫ్ఐ జాతీయ స్విమ్మింగ్ చాంపియన్ షిప్ పోటీలలో నగరానికి చెందిన క్రీడాకారులు సత్తాను చాటారు. డి.వర్షిత్ అండర్-17, (400) మీటర్ల ఆధ్వర్యంలో 2వ స్థానంలో నిలిచి ప్రతిభను చాటాడు. ఈ సందర్భంగా కోచ్ జైన్ సిద్ధిఖీ క్రీడాకారులను అభినందించారు.

రేపు 'సెయింట్ జార్జెస్' 190 ఏళ్ల వేడుకలు



వివరాలు వెల్లడిస్తున్న స్పెషల్ ఆఫీసర్ ఆర్.సత్యానందం, ప్రిన్సిపల్స్ రుత్ లజ్వంతి, జె.మార్తా నిస్సి డ్యానియేల్

అబిడ్స్: జంట నగరాల్లోనే నిజాం కాలంలో ప్రారంభించిన అతి పురాతనమైన సెయింట్ జార్జెస్ గ్రామర్ స్కూల్స్ 190 సంవత్సరాల వేడుకలు నిర్వహిస్తున్నట్లు ఆ విద్యా సంస్థల స్పెషల్ ఆఫీసర్ ఆర్.సత్యానందం పేర్కొన్నారు. అబిడ్స్‌లోని సెయింట్ జార్జెసెస్ గ్రామర్ స్కూల్స్ ఆవరణలో పాఠశాలల ప్రిన్సిపల్స్ రుత్ లజ్వంతి, జె.మార్తా నిస్సి డ్యానియేల్, పాఠశాలల వార్డెన్, కరస్పాండెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.విమల్ సుకుమార్‌తో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. 1834వ సంవత్సరంలో ముందుగా ది హైదరాబాద్ రెసిడెన్షియల్ స్కూల్ పేరిట కేవలం ఐదు మంది విద్యార్థులతో ప్రారంభమైన తమ పాఠశాలలు నేడు 4300 మంది విద్యార్థులతో కొనసాగుతుందన్నారు. ఈనెల 29వ తేదీన సాయంత్రం 190 ఏళ్ల వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. కళాలల విద్యార్థులతో పాటు పూర్వ విద్యార్థులు సైతం ఈ వేడుకల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. ముఖ్య అతిథులుగా మెదక్ ఇన్‌చార్జ్ బిషప్ డయోసిస్ రైట్‌రేవ్ ప్రొఫెసర్ డా. కె.రియోబిన్ మార్క్, రేవ్ డాక్టర్ కె.ప్రిసిల్లా పరిమల రియోబిన్ మార్క్ హాజరై వేడుకలను ప్రారంభిస్తారని తెలిపారు.

విశ్వవ్యాప్త ప్రముఖులు తమ విద్యార్థులు..

సెయింట్ జార్జెస్ గ్రామర్ స్కూల్స్‌లో విద్యను అభ్యసించిన విద్యార్థులు తెలంగాణ ఆంధ్ర రాష్ట్రాలతో కాక ప్రపంచ వ్యాప్తంగా పలు రంగాల్లో ప్రముఖ పాత్ర పోషిస్తున్నారని వారు వెల్లడించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో పాటు అరుణ బహుగుణ, జేడీ చక్రవర్తి లాంటి ప్రముఖులతో పాటు ఎంతో మంది రాజకీయ, ఇతర రంగాల్లో కొనసాగుతుండటం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు.

జి.నారాయణమ్మ కళాశాలలో మాక్ పార్లమెంట్


మాక్ పార్లమెంట్‌లో విద్యార్థినులు

గోల్కొండ: మాక్ పార్లమెంట్ కార్యక్రమాలతో విద్యార్థులకు సమకాలిన పరిస్థితులపై అవగాహన కలుగుతుందని తెలంగాణ గవర్నర్ డిప్యూటీ సెక్రటరీ జి.పల్లవి అన్నారు. బుధవారం షేక్‌పేట్ జి.నారాయణమ్మ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మాక్ పార్లమెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 150 మంది విద్యార్థినులు ఎంపీలు, మంత్రులు, స్పీకర్‌లుగా హుందాగా ఎలా వ్యవహరించాలో చక్కగా కళ్లకు కట్టినట్లు చూపించారు. ప్రతిపక్షంగా ఉన్న వారు అధికారంలో ఉన్న వారిని ప్రజా సమస్యలపై చక్కగా నిలదీస్తు తమలోని వాగ్ధాటిని నిరూపించుకున్నారు. ప్రతిపక్షాల ప్రశ్నలకు తిప్పి కొట్టడం తమకు మంచినీరు తాగినట్లే అని మాక్ పార్లమెంట్‌లోని మంత్రులు సరైన జవాబులు ఇస్తు తమలోని సత్తాను చాటుకున్నారు. అయితే మాక్ పార్లమెంట్‌కు స్పీకర్‌గా వ్యవహరించిన విద్యార్థిని పార్లమెంట్‌లో తన స్థానం ఏమిటో నిరూపిస్తు కొందరిని పార్లమెంట్ నుంచి సస్పెండ్ చేస్తూ మరికొందరిని బౌన్సర్లచే బయటకు పంపుతూ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన జి.పల్లవి మాక్ పార్లమెంట్ నిర్వహణను ఎంతగానో మెచ్చుకుంటూ మాక్ పార్లమెంట్‌లోని సభ్యులను అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం పార్లమెంట్‌లోని ఉభయ సభల పాత్ర తదితర విషయాలు కళాశాల విద్యార్థినులు బాగా అర్థం చేసుకున్నారని అన్నారు. భారత రాజ్యాంగం భారతీయులకు వరం లాంటిదని ఆమె అన్నారు. మన ప్రజాస్వామ్య మూల స్తంభాలను విద్యార్థులు తెలుసుకొని, పౌరసత్వ బాధ్యతలను సైతం అర్థం చేసుకోవడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌రెడ్డి, డాక్టర్ ఏ.మాధవిలత, డాక్టర్ టి.అనురాధా, నీలం దుర్గాభవానీ, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. అనంతరం మాక్ పార్లమెంట్‌లో అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు అందజేశారు.

సంక్షేమ పథకాల అమలుకు సమగ్ర సర్వే దోహదం

గోల్కొండ: సంక్షేమ పథకాల అమలుకు సమగ్ర కుటుంబ సర్వే దోహదపడుతుందని టీపీసీసీ అధ్యక్షుడు బీ.మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. సమగ్ర కుటుంబ సర్వే కార్వాన్ నియోజకవర్గంలో జరుగుతున్న విధానాన్ని కాంగ్రెస్ నాయకులు కురాకుల కృష్ణ బుధవారం ఆయనను కలిసి వివరించారు. ఈ సందర్భంగా బీ.మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాల్లో సమగ్ర కుటుంబ సర్వే ఒకటని టీపీసీసీ అధ్యక్షుడు అన్నారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి, అమలు అవుతున్న సంక్షేమ పథకాలు ప్రతిపక్షాల వారికి రుచించడం లేదని తెలిపారు. అందువల్లే తెలంగాణలో బీఆర్ఎస్, బీజేపీలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై లేనిపోని ఆరోపణలు సృష్టించి ప్రజలను గందరగోళానికి కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కురాకుల కృష్ణ, ఏ.చంద్రశేఖర్, రఘుపాల్‌రెడ్డి తదితరులున్నారు.

ఉస్మానియాలో చికిత్స పొందుతున్న వ్యక్తి అదృశ్యం

అఫ్జల్‌గంజ్: అనారోగ్యం కారణంగా ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఓ వ్యక్తి అదృశ్యమైన సంఘటన అఫ్జల్‌గంజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా, కందుకూరు మండలం, కొత్తగూడెం గ్రామానికి చెందిన ఎస్.కిషోర్(36) చాతి నొప్పితో బాధపడుతుండగా అతని కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందించిన వైద్యులు పలు వైద్య పరీక్షలు నిర్వహించాలని అడ్మిట్ చేసుకున్నారు. అనంతరం అతను అక్కడి నుంచి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

గంజాయి విక్రయిస్తే చర్యలు

అబిడ్స్: ధూల్‌పేట్‌లో గంజాయి విక్రయాలను వదిలేయాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ కమిషనర్ ఖురేషి పేర్కొన్నారు. మల్లయోధులు కళాకారులుగా ఎంతో పేరు ప్రఖ్యాతలు ఉన్న ధూల్‌పేటవాసులు తమ సంస్కృతిని మరిచి గంజాయి విక్రయించడం బాధాకరమన్నారు. ధూల్‌పేట్‌లో బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. వెంటనే గంజాయి అమ్మకాలు పూర్తిగా నిలిపివేయకపోతే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధూల్‌పేట ఇన్‌చార్జి అధికారి నంద్యాల అంజిరెడ్డి, మాజీ కార్పొరేటర్ పరమేశ్వరీ సింగ్, అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ భాస్కర్, ఇన్‌స్పెక్టర్లు మధుబాబు, గోపాల్, చంద్రశేఖర్, వెకటేశ్వర్లు, కోటమ్మ పాల్గొన్నారు.

గోల్కొండ ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి చొరవ చూపాలి

కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్


క్రిస్టినా జెడ్ చోంక్తుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి చొరవ చూపి అవసరమైన నిధులు విడుదల చేయాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. గురువారం తెలంగాణ కుటుంబ ఆరోగ్య సంక్షేమ శాఖ కార్యదర్శి క్రిస్టినా జెడ్ చోంక్తును కలిశారు. ఈ సందర్భంగా ఆయన గోల్కొండ ఏరియా ఆసుపత్రికి సరిపడా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది లేరని ఆమె దృష్టికి తెచ్చారు. ఈ ఆసుపత్రిని వంద పడకల నుంచి 200 పడకల ఆసుపత్రిగా మార్చడం జరిగిందని అయితే దీనికి సరిపడా సంఖ్యలో వైద్యుల నియామకాలు జరగలేదని ఆయన అన్నారు. ప్రస్తుతం ఈ ఆసుపత్రి ఇన్‌పేషంట్ విభాగం వంద శాతం ఆక్యూపెన్సీతో ఉందని ఆయన అన్నారు. అంతేకాకుండా గతంలో జరిగిన వైద్యుల బదిలీలలో గోల్కొండ ఆసుపత్రి నుంచి ఖాళీ అయిన స్థానాలు ఇంకా భర్తీ కాలేదని ఆయన అన్నారు. అసలే నగరంలో సీజనల్ వ్యాధులు పబలుతున్నాయని ఆసుపత్రిలో తగిన సంఖ్యలో వైద్యులు లేకపోవడం వల్ల ఆసుపత్రికి వచ్చే పేదలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆసుపత్రి కొత్త బ్లాక్ కోసం నిధులు విడుదల చేయాలని ఆయన కోరారు. ఈ ఆసుపత్రికి కార్వాన్ నుంచే కాకుండా శివారు ప్రాంతాల ప్రజలు సైతం వస్తారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా క్రిస్టినా జెడ్ చోంక్తు ఆసుపత్రి నూతన బ్లాక్ నిర్మాణానికి ఎనిమిది కోట్ల రూపాయలతో ప్రతిపాదనలను ఆర్థిక శాఖకు పంపించడం జరిగిందని ఆమె అన్నారు. అనంతరం ఆయన బల్దియా కమిషనర్ కె.ఇలంబర్తిని కలిశారు. వీడీసీసీ రోడ్ల మరమ్మతులు తదితర వాటికి పది కోట్ల రూపాయలు అవసరం అవుతాయని దీనిని వెంటనే విడుదల చేయాలన్నారు. గత వర్షాకాలంలో భారీ వర్షాలకు కార్వాన్ నియోజకవర్గంలోని రోడ్లు గుంతలమయంగా మారాయని రోడ్ల మరమ్మతులకు వెంటనే నిధులు విడుదల చేయాలని ఆయన బల్దియా కమిషనర్‌ను కోరారు. సంబంధిత జోనల్ అధికారులతో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా బల్దియా కమిషనర్ ఆయనకు హామీ ఇచ్చారు.

క్రిడాలో ముగిసిన ప్రాంతీయ కన్సల్టేషన్ వర్క్‌షాపు

సంతోష్‌నగర్: సంతోష్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐసీఏఆర్-క్రిడా)లో రెసిలెంట్ బెసిన్ డెవలప్‌మెంట్ కోసం క్యాచ్‌మెంట్ రెసిలెన్స్ ఇండెన్స్ డెవలప్‌మెంట్‌పై రెండు రోజుల పాటు నిర్వహించిన ప్రాంతీయ కన్సల్టేషన్ వర్క్‌షాపు బుధవారం ఘనంగా ముగిసింది. ఈ వర్క్‌షాపుకు ముఖ్య అతిథిగా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు చైర్మన్ డాక్టర్ ముఖేశ్ కుమార్ సిన్హా హాజరయ్యారు. ఐసీఏఆర్-క్రిడా ఇన్‌చార్జి డైరెక్టర్ డాక్టర్ ఎస్.కె.బాల్ ప్రముఖులకు ఘనంగా స్వాగతం పలికి క్రిడా ఓవర్ వ్యూను వివరించారు. ఐడబ్ల్యూఎంఐ ప్రతినిధి డాక్టర్ అలోక్ సిక్కా వర్క్‌షాపు ఉద్దేశాన్ని వివరించారు. తన కీలక ప్రసంగంలో కరువు, నీటి కొరతతో పాటు ప్రమాదం, స్థితిస్థాపకత పరిమితులను పరిగణలోకి తీసుకొని ఇంటిగ్రేటెడ్ క్యాచ్‌మెంట్ రెసిలెన్స్ ఇండెక్స్ (సీఆర్ఐ) అభివృద్ధి ఆవశ్యకతను వివరించారు.

- ఐడబ్ల్యూఎంఐ ఇంటిగ్రేట్ ప్రాజెక్ట్ లీడ్, ప్రినసపాల్ రీసెర్చర్ డాక్టర్ గిరిరాజ్ అమర్‌నాథ్ వర్క్‌షాపు అంచనాలు వివరించారు. ఐసీఏఆర్ ఇంటిగ్రేట్ ప్రాజెక్టు, క్యాచ్‌మెంట్ రిస్క్ అండ్ రెసిలెన్స్ ఇండెక్స్ (సీఆర్ఐ)ను వివరించారు. డాక్టర్ ముఖేశ్ కుమార్ సినార తన కీలక ప్రసంగంలో సీఆర్ఐ ఇండెక్స్‌ను అభివృద్ధి చేయడంలో తన సహకారాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో ఐడబ్ల్యూఎంఐ, ఐసీఏఆర్-క్రిడా, ఐసీఏఆర్-ఐఐడబ్ల్యూఎం, ఎన్ఆర్ఎస్‌సీ, ఇక్రిశాట్, ఎన్ఐహెచ్, తెలంగాణ నీటి పారుదల శాఖ, నాబార్డ్, వాలంతరీ, అంగ్రవుతో పాటు ఇతర రాష్ట్ర శాఖలతో సహ వివిధ సంస్థల నుండి మొత్తం 42 మంది భాగస్వాములు చురుకుగా పాల్గొన్నారు.


వర్క్‌షాపులో పాల్గొన్న గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు చైర్మన్ డా. ముఖేశ్‌కుమార్ సిన్హా, ఐసీఏఆర్-క్రిడా ఇన్‌చార్జి డైరెక్టర్ డా. ఎస్‌కే బాల్